మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక

ఆగస్ట్ 20 నుంచి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం



2 లో..

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 73 | బుధవారం | 20 - 08 - 2025 | పేజీలు: 8 | వెల: 4




# సంజీవని పేరిట కొత్త పథకం

- మంగళగిరిలో నిర్వహించిన పీ4 ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- బంగారు కుటుంబాలు, వారిని దత్తత తీసుకున్న మార్గదర్శులతో ముఖాముఖి

మన గళం, గుంటూరు :ఆర్థిక సంస్కరణల వల్ల సంపద సృష్టించడం చాలా సులభమైందని కానీ సమాజంలో పేదలు ఇంకా అలానే ఉన్నారని సీఎం చంద్రబాబు అన్నారు. అలాంటి వారిని ఆర్థికంగా అందరితో సమానంగా పైకి తీసుకొచ్చేందుకే పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో నిర్వహించిన పీ4 ప్రారంభ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ముందుగా బంగారు కుటుంబాలు, వారిని దత్తత తీసుకున్న మార్గదర్శులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. విదేశాల్లో ఉన్న వారితో జూమ్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. బంగారు కుటుంబాల దత్తతకు సౌదీ అరేబియాకు చెందిన పలువురు తెలుగు వాళ్లు ముందుకొచ్చారు. అలాగే కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత తీసుకున్నారు. దత్తత సంకేతంగా అడాప్ట్ ట్రీని బంగారు కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మార్గదర్శులు డబ్బులివ్వడమే కాదు, ఇబ్బందులు తొలగించేలా భరోసా ఇవ్వగలగాలని స్పష్టంచేశారు. ఓ అజ్ఞాత భక్తుడు తాను పెట్టిన కంపెనీ ద్వారా వచ్చిన సంపాదన నుంచి రూ.140 కోట్ల విలువైన 121 కేజీల బంగారాన్ని వెంకన్నకు ఇస్తున్నారని గుర్తుచేశారు. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదని

2 లో..





## దేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారు

- నెహ్రూపై మరోసారి విరుచుకుపడ్డ ప్రధాని మోదీ
- సింధు జలాల ఒప్పందం నెహ్రూ చేసిన చారిత్రక తప్పిదం అన్న ప్రధాని మోదీ

మన గళం, న్యూఢిల్లీ : భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో నెహ్రూ చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని, తద్వారా దేశ రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ

2 లో..

## ట్రంప్ పాలనలో 6 వేల మంది విద్యార్థుల వీసాలు రద్దు




- స్థానిక చట్టాలను అతిక్రమించడమే ప్రధాన కారణం

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు స్థానిక చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందేనని అక్కడి ప్రభుత్వం స్పష్టం చేసింది. చట్టాన్ని అతిక్రమిస్తే వీసా రద్దు సహా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరించింది. ఈ విధంగా ఇప్పటి వరకు 6 వేల మంది విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగ శాఖ వర్గాలను ఉటంకిస్తూ బీబీసీ ఓ రిపోర్టును ప్రచురించింది. ఇందులో 4 వేల మంది చట్టాల అతిక్రమణ, డ్రంకెన్ డ్రైవ్, దాడులు, దోపిడీ వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు పేర్కొంది. ఐఎన్ఏ 3బీ కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది కూడా ఈ

2 లో..

## అమరావతిపై మీ ఏడుపులు ఆపండి



- వైసీపీ విష ప్రచారానికి ఆ 11 సీట్లు కూడా రావు
- మంత్రి నారాయణ వార్నింగ్

మన గళం, అమరావతి : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తీవ్ర

2 లో..

## సీపీ రాధాక్రిష్ణన్ ను కలిసిన ఎంపీ బైరెడ్డి శబరి



మనగళం, నెట్ వర్క్ : ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాక్రిష్ణన్ ను మంత్రి నారా లోకేష్, తదితర నాయకులతో కలిసి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ రాధాక్రిష్ణన్ కు అభినందనలు తెలిపారు.




## సీసీటీవీ ఫుటేజ్‌తో గుట్టురట్టు

- శ్రీకాకుళం జిల్లాలో వెలుగు చూసిన దారుణ హత్య

మన గళం, శ్రీకాకుళం : ప్రియుడి మోజులో పడిన ఓ ఇల్లాలు, కట్టుకున్న భర్తనే అత్యంత కిరాతకంగా హత్య చేసింది. ఈ దారుణానికి వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు తేల్చారు. హత్యను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినా, పోలీసుల లోతైన దర్యాప్తుతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. ఈ దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో చోటుచేసుకుంది. పాతపట్నం మొండిగల వీధికి చెందిన నల్లి రాజు (స్థిరాస్తి వ్యాపారి)కి, మౌనికకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సజావుగా సాగుతున్న వీరి కాపురంలో వివాహేతర

2 లో..

## వాయుగుండంగా మారిన అల్పపీడనం



మన గళం, విశాఖపట్నం : వాతావరణ పరిస్థితిపై వైజాగ్ తుపాను హెచ్చరిక కేంద్రం జగన్నాథ్ కుమార్ కీలక సమాచారం ఇచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని చెప్పారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. ఒరిస్సాలోని భవానీపట్నానికి 90 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందన్నారు. ఈ వాయుగుండం దక్షిణ ఒరిస్సా, దక్షిణం చత్తీస్‌ఘడ్ మీదుగా ప్రయాణించి అల్ప పీడనముగా బలహీనపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని జగన్నాథ్ తెలిపారు. వాయుగుండం ఎఫెక్ట్‌తో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని జగన్నాథ్ కుమార్ తెలిపారు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. అన్ని పోర్టులలోనూ

2 లో..

## అమరావతి జోలికొస్తే పాతాళానికి తొక్కుతాం

- పసికూన అమరావతిని నాశనం చేయాలని చూడొద్దన్న కొలికపూడి





మన గళం, అమరావతి : వైసీపీ అధినేత జగన్ అమరావతిపై ఉద్దేశపూర్వకంగా విషపు ప్రచారం చేయిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. ఇప్పుడే పుట్టిన పసికూన లాంటి అమరావతిని నాశనం చేయాలని చూస్తే, రైతులు ఉద్యమించి జగన్‌ను పాతాళంలోకి తొక్కేస్తారని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ జగన్ తన మీడియా ద్వారా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. “400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరమే చిన్నపాటి వర్షానికి అతలాకుతలం అవుతోంది. అలాంటిది, కొత్తగా నిర్మిస్తున్న అమరావతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్న జగన్ ఇల్లు మునిగిందా?” అని కొలికపూడి సూటిగా ప్రశ్నించారు. అమరావతి అంశంపై చర్చకు తాను సిద్ధమని, జగన్ లేదా వైసీపీ నుంచి ఎవరైనా రావొచ్చని ఆయన సవాల్ విసిరారు. గతంలో

2 లో..

# దేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారు

మాట్లాడుతూ, "నెహ్రూ దేశాన్ని ఒకసారి కాదు, రెండుసార్లు విభజించారు. మొదట రాడ్‌క్లిఫ్ లైన్‌తో, ఆ తర్వాత సింధు జలాల ఒప్పందంతో దేశానికి నష్టం చేకూర్చారు" అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కింద సింధు నది జలాల్లో 80 శాతం నీటిని పాకిస్థాన్‌కు ధారాదత్తం చేశారని ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత తన కార్యదర్శి వద్ద ఈ ఒప్పందం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదని నెహ్రూ స్వయంగా తన తప్పును అంగీకరించారని మోదీ తెలిపారు. ఈ ఒప్పందం పూర్తిగా రైతు వ్యతిరేకమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోదీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచారని విమర్శించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే వారి అభివృద్ధి మొదలైందని అన్నారు. ఎన్డీయే హయాంలో దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

**– నెహ్రూను నిందించడం అలవాటుగా మారింది: ప్రియాంక**

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే పదేపదే నెహ్రూను నిందిస్తోందని ఆమె విమర్శించారు. "గతాన్ని పదేపదే తవ్వడం మానేసి, వర్తమానంలో జరుగుతున్న విషయాలపై సమాధానం చెప్పాలి. ఓట్ల దొంగతనం ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రజలకు జవాబుదారీగా ఉండాలి" అని పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రియాంక డిమాండ్ చేశారు.

# ట్రంప్ పాలనలో 6 వేల మంది విద్యార్థుల వీసాలు రద్దు




జాబితాలో ఉన్నారని తెలిపింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ఉన్నత విద్యావ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాలయాలను దృష్టిలో పెట్టుకుని పాలసీల మార్పులు చేపట్టారు. కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో కోత విధించారు. ఈ చర్యల ప్రభావం విదేశీ విద్యార్థులపై ప్రతికూలంగా ఉంటోంది. యూనివర్సిటీ క్యాంపస్ లలో ఆందోళనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థులను అధికారులు అరెస్టు చేశారు. విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడానికి ముందే వారి వారి సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సోషల్ మీడియా ఖాతాల వివరాలు వెల్లడించని విద్యార్థులకు వీసా ప్రక్రియను అధికారులు నిలిపివేస్తున్నారు. కాగా, గతేడాది గణాంకాల ప్రకారం దాదాపు 10 లక్షల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. ఈ విద్యార్థుల ద్వారా అమెరికాకు సుమారు 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది.

# సీసీటీవీ ఫుటేజ్‌తో గుట్టురట్టు




సంబంధం చిచ్చు రేపింది. అదే ప్రాంతానికి చెందిన ఉదయ్ కుమార్‌తో మౌనికకు అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్త రాజుకు తెలియడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్తను శాశ్వతంగా తొలగించుకోవాలని మౌనిక, ఆమె ప్రియుడు ఉదయ్ నిర్ణయించుకున్నారు.

ఇందుకు పక్కా ప్రణాళిక రచించారు. పథకంలో భాగంగా ఉదయ్ 10 నిద్రమాత్రలు తీసుకొచ్చి మౌనికకు ఇచ్చాడు. వాటి ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు, మొదటి రోజు భర్త తినే ఆహారంలో నాలుగు మాత్రలు కలిపింది. రాజు గాఢ నిద్రలోకి జారుకోవడంతో, మరుసటి రోజు హత్యకు రంగం సిద్ధం చేసింది. రెండో రోజు భోజనంలో మిగిలిన ఆరు నిద్రమాత్రలు కలిపి పెట్టగా, రాజు స్పృహ కోల్పోయాడు. అర్ధరాత్రి సమయంలో మౌనిక తన ప్రియుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. ఉదయ్, మరో వ్యక్తితో కలిసి వారి ఇంటికి చేరుకున్నాడు. ముగ్గురూ కలిసి నిద్రమత్తులో ఉన్న రాజు ముఖంపై దిండు పెట్టి అదిమి, ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం వీధి లైట్లు ఆపేసి, మృతదేహాన్ని స్కూటీపై తీసుకెళ్లి ఎస్సీ కాలనీ సమీపంలో పడేశారు. రాజు అతిగా మద్యం తాగి, బండిపై నుంచి పడి చనిపోయినట్లు నమ్మించేందుకు మృతదేహం పక్కన అతని బైక్‌తో పాటు ఓ మద్యం సీసాను కూడా ఉంచారు.మరుసటి రోజు ఉదయం, స్థానికులు మృతదేహాన్ని గుర్తించడంతో మౌనిక ఏమీ తెలియనట్లు నటిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే, మృతదేహంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. పోస్టుమార్టం నివేదికలో ఊపిరాడక చనిపోయినట్లు తేలడంతో హత్యగా నిర్ధారించుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను, మౌనిక కాల్ డేటాను పరిశీలించగా అసలు బండారం బయటపడింది. పోలీసులు మౌనిక, ఆమె ప్రియుడు ఉదయ్‌తో పాటు హత్యకు సహకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు. క్షణికానందం కోసం కట్టుకున్న భర్తను చంపి తల్లి జైలుపాలు కావడంతో, ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

# సంజీవని పేరిట కొత్త పథకం

వెళ్లేటప్పుడు ఏం తీసుకెళ్లలేరు ఉన్నప్పుడు మనుషులుగా బతకాలి చనిపోయిన తర్వాత కూడా మనల్ని గుర్తు పెట్టుకునే పనులు చేయాలని అభిప్రాయపడ్డారు. మానవత్వంతో మంచి సమాజం కోసం పని చేయాలని కోరుతున్నానని అన్నారు. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోని అభివృద్ధి చెందాలని సీఎం ఆకాంక్షించారు. మార్గద ర్శులు ఇచ్చిన చేయూతను బంగారు కుటుం బాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలని తెలిపారు. చాలా మంది ఉపాధి గురించి, ఆరోగ్యాన్ని చక్కదిద్దాలని కోరుతున్నారని సీఎం వెల్లడించారు. ప్రజారోగ్య పరిరక్షణకు కొత్త పథకం: ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని పేరిట కొత్త పథకం తీసుకొస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. ఉత్తమ ఆరోగ్య విధానంగా



సంజీవిని అమలవుతుందని అన్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతామని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సంజీవనిలానే ఈ పథకం అమలవుతుందని వెల్లడంచారు. సంపద సృష్టించి ఆ సంపదను పేదలకు ఇచ్చే ప్రభుత్వం తమది అని చంద్రబాబు అన్నారు. అభి వృద్ధి వైకుంఠపాళి కాకూడదని ప్రభుత్వం కంటిన్యూగా ఉంటే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చేలా చేశామని వెల్లడించారు. ఆడబిడ్డలతోసహా ప్రతి ఒక్కరూ ఏదోక పని చేయాలని, ఇదే లక్ష్యమని అన్నారు. ఆర్థిక సంస్కరణలతో సంపద వచ్చిందని, ఇప్పుడు సమాజంలో అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం అందిస్తు న్నమని అన్నారు. ఈ నెలలో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ రూపొందించామని అన్నారు.

# అమరావతిపై మీ ఏడుపులు ఆపండి

మొదటిపేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై మీ ఏడుపులు ఇకనైనా ఆపాలని హితవు పలికారు. కొండవీటి వాగు ప్రవావాహానికి ఆటంకం వల్ల నీరు నిలిచిపోయిన నీరుకొండ పరిసర ప్రాంతాలను మంత్రి నారాయణ ఇవాళ(మంగళవారం) పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. పశ్చిమ బైపాస్ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణంతో కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో మట్టిని అడ్డ వేసి వదిలేయడంతో వాగు ప్రవాహానికి ఇబ్బందులు వచ్చాయని వివరించారు మంత్రి నారాయణ.

అడ్డుగా ఉన్న మట్టిని తొలగించడంతో పాటు వెస్ట్ బైపాస్ రోడ్డుకు రెండు చోట్ల గండ్లు కొట్టి నీరు వెళ్లేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగన్ అండ్ కో విష ప్రచారాలు చేస్తే వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన ఆ 11 సీట్లను కూడా ప్రజలు ఇవ్వరని చెప్పుకొచ్చారు. నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...? అని ప్రశ్నించారు. గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా? అని నిలదీశారు. పశ్చిమ బైపాస్‌పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందని తెలిపారు మంత్రి నారాయణ. అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందని.. మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటకు వెళ్లిపోయిందని వెల్లడించారు. కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న మట్టిని తొలగిస్తున్నామని అన్నారు. అధికారులు, ఇంజనీర్లు కలిసి కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న మట్టిని తొలగించే పనుల్లో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈరోజు రాత్రికి మొత్తం నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాజధాని అమరావతి మునిగిపోతుందంటున్న వారు ఇక్కడికి వచ్చి చూడాలని.. కారణాలు తెలియకుండా మాట్లాడవద్దని హితవు పలికారు. వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరని మంత్రి నారాయణ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# వాయుగుండంగా మారిన అల్పపీడనం

మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందన్నారాయన. కోస్తా తీరం వెంబడి 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని.. మత్స్యకారులు వేటకు వెళ్లవొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

**– ఈ జాగ్రత్తలు తీసుకోండి..**

భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితమైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వారు చెట్ల కింద తలదాచుకోవద్దని సూచించారు. సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలన్నారు. అలాగే మత్స్యకారులు సముద్రంలో వేటకి వెళ్లొద్దని హితవు చెప్పారు.



# అమరావతి జోలికొస్తే పాతాళానికి తొక్కుతాం

మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు ముందుచూపుతో నిర్మించిన కొండవీటి వాగు ద్వారానే వరద నీరు నదిలోకి వెళుతోందన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అంతేకాకుండా, 2019లో వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణే రాయపూడిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించిన విషయాన్ని జగన్ మరిచిపోయారా అని నిలదీశారు. ప్రకృతి విపత్తులు ఎక్కడైనా సంభవిస్తాయని, ముంబై, జమ్మూ కశ్మీర్ వరదలే ఇందుకు నిదర్శనమని అన్నారు. మరోవైపు, కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు బస్టాండ్ నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం వల్ల తిరువూరు నుంచి విజయవాడకు రానుపోను రూ. 240 ఆదా అవుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వైద్యం, చదువుల కోసం తరచూ విజయవాడకు వెళ్లే తమకు ఈ పథకం ఎంతో లబ్ధి చేకూరుస్తోందని వారు ఎమ్మెల్యేకు వివరించారు.

# ఆగస్ట్ 20 నుంచి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మన గళం, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. రేపట్నుంచే (ఆగస్ట్ 20) నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఈ మేరకు ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలను అదే రోజున వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తన ప్రటకనలో తెలిపింది. రిజిస్ట్రేషన్లకు ఐదారు రోజులు సమయం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా తెలుసుకోవచ్చు. తెలంగాణలో ఉమ్మడి పరీక్షలకు సంబంధించి గత ఏడాది ఓ కొత్త రూల్ అమలులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. నియమాక పరీక్షలుతోపాటు ఇతర ప్రవేశ పరీక్షలకు ప్రాథమిక ఆన్సర్‌కీపై అభ్యంతరాలు లేవనెత్తేందుకు నిర్దిష్ట రుసుము చెల్లించాలనే కొత్త నిబంధన తీసుకువచ్చింది. దీంతో టీజీపీఎస్సీ నియామక పరీక్షలతోపాటు రాష్ట్రంలో నిర్వహించే అన్ని ఉమ్మడి పరీక్షలకు ఆన్సర్ కీలపై అభ్యంతరాలు లేవనెత్తాలంటే ఒక్కో ప్రశ్నకు నిర్దిష్ట రుసుము చెల్లించాలని పేర్కొంది. ఈ విధానం ద్వారా



అనవసరంగా సమయం వృద్ధా అవ్వడం అరికట్టవచ్చని, సకాలంలో నియామకాలు పూర్తి చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పటి వరకు జరిగిన అన్ని పరీక్షలకు ఈ విధానం అమలు చేస్తూ వచ్చింది. తాజాగా ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష(టీజీ సీపీగెట్) ప్రాథమిక కీపై కూడా అభ్యర్థులు అభ్యంతరం తెలిపేందుకు తొలిసారిగా ఫీజు చెల్లించాలని పేర్కొంటూ ప్రకటన జారీ చేసింది. ఈ ఏడాది జరిగిన ఈఏపీసెట్, ఐసెట్ వంటి పలు ప్రవేశ పరీక్షలకు అభ్యంతరాలపై ఫీజు వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇదే మాదిరి సీపీగెట్‌లోనూ ఒక్కో ప్రశ్నపై అభ్యంతరానికి ఫీజు రూ.200 చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. ఒకవేళ అభ్యర్థులు తెలిపే అభ్యంతరాలు సరైనవని తేలితే వాటిని పరిగణనలోకి తీసుకుని, ఫీజును తిరిగి చెల్లిస్తామని సీపీగెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆగస్ట్ 21వ తేదీ ఉదయం 11 గంటల వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్ విధానంలో పంపొచ్చని ఆయన సూచించారు.

## గౌరీ శంకర స్వామికి పంచామృతాభిషేకం

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా కేంద్రం కర్నూలులోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆరుద్రా నక్షత్రం సందర్భంగా పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ శంకర స్వామికి ప్రాతఃకాలంలో పంచామృతాభిషేకం, అన్నాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు.





## నాగేశ్వరరావును పరామర్శించిన నాయకులు



మనగళం, కర్నూలు సిటీ : అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు జై నాగేశ్వరరావును ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, సహాయ కార్యదర్శి కృష్ణ నాయకులు మద్దిలేటి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పరామర్శించారు. త్వరగా కోలుకొని మళ్లీ కార్మికుల సంక్షేమం కోసం పోరాటాల్లో యధావిధిగా పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున రూ. 5 వేలు అందజేశారు.

## హమాలీ కార్మికుడు ఏసేపు మృతి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ మండలం ఈ. తాండ్రపాడు చెందిన కేడీసీఎంఎస్ హమాలీ కార్మికుడు ఏసేపు మృతి చెందారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్, ఈ. తాండ్రపాడు గ్రామ సర్పంచ్ ఎస్ బాలపీర, సీఐటీయూ కర్నూల్ మండల అధ్యక్షుడు పి.బి హుస్సేనయ్య, నాయకులు అబ్దుల్ దేశాయ్, ఎస్ ఎండి షరీఫ్, సి నాగరాజ్, మహబూబ్ బాషా తదితరులు నివాళులర్పించారు. ఏసేపు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో పాల్గొన్న కేడీసీఎంఎస్ హమాలి యూనియన్ సంఘం నాయకులు సి నాగరాజు, ప్రకాష్, వెంకటేశ్వర్లు,శ్రీను, గోపాల్, మధు, సూరి ,రాజు, మనీ,శివ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మకర్త మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

మనగళం, ఆదోని : ఆదోని పట్టణంలోని రాజరాజేశ్వరి దేవాలయం ధర్మకర్త మృతి పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదోని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆదోని డీఎస్పీ మ్రరిపాటి హేమలతకు వినతి పత్రం అందజేశారు. ధర్మకర్త మృతి పై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపించాలని డీఎస్పీని నాయకులు కోరారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్





మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఆగస్టు నెలంతా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ తనిఖీలు ముమ్మరం చేశారు పోలీసులు. జిల్లా వ్యాప్తంగా సీఐలు, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసులు రహదారుల పై వాహనాల తనిఖీలు చేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారి పై గట్టి చర్యలు చేపట్టారు. ఆగష్టు 4 నుండి ఆగస్టు 10 వరకు డ్రంకెన్ డ్రైవ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు 491 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఆగస్టు 11 - 17 వరకు హై స్పీడ్ పై డ్రైవ్ నిర్వహించారు. 399 ఓవర్ స్పీడ్ కేసులు నమోదు చేశారు. ఆగస్టు 18 - 24 వరకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆగస్టు 25 - 31 వరకు ప్రమాదాలకి ఎక్కువగా గురయ్యే ప్రాంతాలను గుర్తించేందుకు బ్లాక్ స్పాట్ గుర్తింపు డ్రైవ్ నిర్వహించనున్నారు పోలీసులు.

# సుంకాలకు వ్యతిరేకంగా నిరసన




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత వ్యవసాయ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలు, ప్రధాని నరేంద్ర మోడీ రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన నిరసన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథ మాట్లాడారు. ట్రంప్ సామ్రాజ్యవాద విధానాల అవలంబిస్తున్నాడని, భారత దేశ వ్యవసాయ ఉత్పత్తులపై 50 శాతం వరకు సుంకాలు విధించడం అన్యాయమన్నారు. పేద దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల పైన కక్ష కట్టి ట్రంప్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఏమాత్రం స్పందించడం లేదని, దేశంలో వ్యవసాయం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పది సంవత్సరాల నుండి ఉపయోగించిన ట్రాక్టర్లను నిషేధిస్తున్నామంటూ మోదీ చెబుతున్నారని, దీనివలన భారతదేశ రైతంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. కొత్త ట్రాక్టర్ కొనడానికి ఆర్థికంగా చాలా ఇబ్బంది పడవలసిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద దోచిపెడుతున్నారని ఆరోపించారు. మోడీ మూడవసారి అధికారులకు వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి అప్పులు రెట్టింపు చేస్తున్నారు విమర్శించారు. కార్యక్రమంలో రైతు నాయకులు గిడ్డయ్య చారి, రబియా, సాగర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్వహణ పనులు పూర్తి చేయించండి

మనగళం, కర్నూలు సిటీ : రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు..

మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు కు సంబంధించిన ప్రతిపాదనలను జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి పంపాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కర్నూలు నగరం లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే మెయిన్ రోడ్ లలో గుంతలు పూడ్చే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుండి కలెక్టరేట్ రోడ్ విస్తరణ పనులకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, బళ్ళారి చౌరస్తా, బిర్లా కాంపౌండ్, కలెక్టరేట్ సర్కిల్ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, ఆటోల వల్ల ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, రద్దీని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కా గా జరిగే విధంగా మూడు షిఫ్ట్ ల ప్రకారం మూడు టీమ్ లను ఏర్పాటు చేయాలని కమిషనర్ ను ఆదేశించారు. నేషనల్ హైవే, కడప పరిధిలో 16 బ్లాక్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, ఈ పనులు వేగవంతం చేయాలని నేషనల్ హైవే, కడప పీడీని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ రాజ్ పరిధిలో ఉన్న రోడ్లు పూర్తిగా పాడై ఉన్నట్లయితే, వాటిని ఉపాధి హామీ కింద చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు. జూలై మాసంలో జరిగిన ప్రమాదాల గురించి సమీక్షించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఆలూరు నుండి కోడుమూరు రోడ్డు లో పెద్ద గుంతలు ఉన్నాయని, వాటిని పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.




– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కొత్తగా ఇన్స్టాల్ చేసిన సీసీ కెమెరాలలో కొన్ని కెమెరాలకు నిర్వహణ లేదని, చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు వీలుగా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డిటిసి శాంత కుమారి, ఎన్ హెచ్ పిడి అశోక్ కుమార్, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధు సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో పారిశుద్ధ్య పనులను సంబంధింత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం ఆయన 37వ వార్డు శాంతినగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారులపై వర్షపు నీరు నిలవకుండా ఆక్రమణలు తొలగించి కచ్చ కాలువ నిర్మించాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కారానికి రూ.50 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా నందికొట్కూరు రహదారిన విస్తరణకు సంబంధించి మార్కింగ్, బాధితులకు ఎండార్స్మెంట్ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ క్రిష్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


# నాన్ లేఅవుట్ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు సువర్ణావకాశం

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ పరిధిలో ఎవరైతే నాన్ లేఅవుట్ ప్లాట్లు వేశారో వాటిరి రెగ్యులరైజ్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్. ఆర్.ఎస్ స్కీం జీ.వో విడుదల చేసిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. జీ.వో విడుదల తేదీ నుండి 90 రోజుల పాటు నాల్ లేఅవుట్ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలలో రెవెన్యూ డివిజన్ల వారీగా పంచాయతీ సెక్రటరీల సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం నంద్యాల డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని సెనిటరీ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే నాన్ లేఅవుట్ ప్లాట్లను కొన్నారో అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారికి కూడా ఎల్.ఆర్.ఎస్ స్కీం సువర్ణవకాశం అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటు వంటి ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని, ఈ అవకాశాన్ని చేజార్చుకుంటే అట్టి వారిని కనుగొని వారిపై



- కుడా చైర్మన్ సోమిశెట్టి

చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వంలో 300 నాన్ లేఅవుట్ ప్లాట్లను వేసినట్లు గుర్తించామని, వారు తమకు తామే ముందుకు వచ్చి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని లేని పక్షంలో భవనాలను కూల్చివేసేందుకు కుడాకు అనుమతులు ఉన్నాయని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పని చేయాలని, తమ పరి ధిలో నాన్ లే అవుట్ ప్లాట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు ఉంటే తమ దృష్టికి తేవాలని, కుడా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చట్టానికి వ్యతిరేకంగా ప్లాట్లు వేసిన వారు ఎవరైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎల్.ఆర్.ఎస్ స్కీం యొక్క లాభాలను పాంప్లెట్లు, మైక్ సిస్టం ద్వారా, బ్యానర్ల ద్వారా పబ్లిసిటీ చేయడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకుంటే ఏ సమస్య ఉండదని సూచించారు.

## పద్మజ మృతికి ఎంపీ బస్తిపాటి నాగరాజు సంతాపం



మనగళం, కర్నూలు సిటీ : దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కుమారుడు జయకృష్ణ సతీమణి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు సోదరి నందమూరి పద్మజ మృతి పట్ల కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటున్న ఆయన ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. పద్మజ మృతితో నందమూరి, దగ్గుబాటి కుటుంబాలల్లో విషాదం నెలకొందని, ఆ రెండు కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్న ఆయన పద్మజ ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి

మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ (ఎన్ సీఓఆర్ డీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలు ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుని పూర్తిస్థాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనివర్సిటీలు , కాలేజీలలో మత్తు పదార్థాల వినియోగంపై వర్క్ షాపులు, ర్యాలీలు తదితర అవగాహన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని చెప్పారు. డివిజన్ల వారీగా ఈ అంశంపై తీసుకుంటున్న చర్యల గురించి ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ, కర్నూలు ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ ఆదోని మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ ఆదోని ఆర్ట్స్ కాలేజీలో అవగాహన కార్యక్రమాలు జరిపామని, కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఆదోని ఆర్డీవో భరత్ నాయక్ లు మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని, ఈ క్రాపింగ్ సమయంలో అంతర పంటలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్, రవాణా శాఖలు కూడా ఈ అంశంపై దృష్టి సారించి, తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, సాగును పూర్తిగా నియంత్రించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. కేసీ కెనాల్, బస్టాండ్ , రైల్వే స్టేషన్ లలో, రాత్రి సమయాల్లో పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ఫ్లై ఓవర్ల లాంటి వాటిలో నిఘా ఉంచుతామన్నారు. రైల్వే, లోకల్ పోలీస్, ఈగల్ టీమ్స్, ఎక్సైజ్ సిబ్బంది టాస్క్ ఫోర్స్ గా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ



- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

సూచించారు. ఈగల్ ఎస్పై సుజన్ కుమార్ కేసుల వివరాలను వివరించారు. అనంతరం మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ శాంతకుమారి, ఆర్టీసీ ఆర్ ఎం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, మెడికల్ కాలేజ్, వైద్య శాఖ అధికారులు, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు సరే... అదనపు బస్సులు ఏవీ ?

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రంలో అదనపు బస్సుల సంఖ్య పెంచాలని ఐద్వా జిల్లా కమిటీ నాయకురాళ్లు డిమాండ్ చేశారు. కూటమి సర్కార్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ,అలివేలు, ఉపాధ్యక్షురాలు సుజాత కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ లో పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే మహిళలతో మాట్లాడుతున్న సందర్భంగా వారు పడిన ఇబ్బందులు అనేకం తెలియజేశారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కంటే ముందు రాష్ట్రంలో అదనపు బస్సుల సంఖ్య పెంచాల్సి ఉండేదని, అలా చేయకుండా డైరెక్ట్ గా పథకం అమలు చేయడం ద్వారా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆదోని, ఆత్మకూరు లాంటి దూరప్రాంతాలకు ప్రయాణం చేసే వారు ఒకటి రెండు బస్సులు మారాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎక్కువ సమయం పడుతుందన్నారు. జిల్లాలో తిరగాలంటేనే ఇంత ఇబ్బందిగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి అన్నవరం విజయవాడ లాంటి ఆధ్యాత్మిక కేంద్రాలకు ఉచితంగా ప్రయాణం చేయొచ్చనే ప్రచారం ఎందుకు చేసినట్లని ప్రశ్నించారు. 8 గంటల నుండి 12 గంటల లోపు చేరుకునే ప్రాంతాలకు రెండు రోజులు సమయం పట్టే పరిస్థితి ఉందని, ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణం వచ్చింది అనే సంతోషం కంటే అదనపు సమయం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఎక్కువ ఉందన్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. విద్యార్థినులు సరైన సమయానికి కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని తెలియజేసినట్లు వివరించారు.



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అదనపు బస్సులు కేటాయించాలని డిమాండ్ చేశారు.





## అర్హులైన వికలాంగుల పింఛన్ తొలగించడం అన్యాయం






మనగళం, కర్నూలు సిటీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత కలిగి గతంలో పింఛన్ పొందుతున్న వికలాంగులకు సంబంధించి రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ తొలగించడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తప్పుపట్టారు. మంగళవారం స్థానిక సీ.ఆర్.భవన్ నందు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబు లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ పెంచి ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీ ప్రకారం అమలు చేస్తున్నప్పటికీ చాలా గ్రామాల్లో అన్ని అర్హతలు ఉన్న వికలాంగులకి రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్ తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని వారినీ తొలగించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అర్హత కలిగిన వారిని తొలగించడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ఇందుకు ఉదాహరణ క్రిష్ణగిరి మండలం సీహెచ్ ఎర్రగుడి గ్రామ పంచాయతీలోని సంగాల గ్రామానికి చెందిన కురువ మహేష్ కూతురు కురువ మాధవి పుట్టుకతో వికలాంగురాలు అని చెప్పారు. అదేవిధంగా గతంలో పింఛన్ వస్తున్నప్పటికీ ఇప్పుడు తొలగించడం అన్యాయమన్నారు. ఇలా నిజమైన అర్హులు పింఛన్ పై ఆధారపడి జీవిస్తున్నారని, తొలగించడం బాధాకరమన్నారు. నిజమైన అర్హులు జిల్లావ్యాప్తంగా చాలామంది పింఛన్ తొలగింపునకు గురయ్యారని, ప్రభుత్వం స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం,కె. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఒడ్డు దాటేందుకే సుగాలి ప్రీతి కేసును అడ్డం పెట్టుకున్నారా?

మనగళం, కర్నూలు సిటీ : ఎనిమిది సంవత్సరాలుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న అంగవైకల్యం ఉన్న ఆ తల్లి, పదేపదే ప్రశ్నించినా పరిష్కారం కాక తన కూతురు సమాధి దగ్గర నుండి అమరావతి సెక్రటేరియట్ దాకా వీల్ చైర్ పోరు యాత్రకు పయనం అయిందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు తెలిపారు. కర్నూలు నగరంలో ఎనిమిది సంవత్సరాల క్రితం కట్టమంచి రామలింగారెడ్డి స్కూల్లో అమానవీయంగా అత్యాచారానికి గురై ఆపై చంపి ఫ్యాన్ రెక్కలకి వేలాడదీయబడిన 14 సంవత్సరాల సుగాలి ప్రీతిబాయి కేసులో నేటికీ సరైన న్యాయం జరగలేదంటూ ఆమె కుటుంబ సభ్యులు ప్రజాసంఘాల నాయకులతో కలిసి మంగళవారం కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సమాధుల తోట ఎదుట రోడ్డు పక్కన సుగాలి ప్రీతిబాయి సంస్కరణ సభ నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు అధ్యక్షతన జరిగిన సంస్కరణ సభలో ప్రీతి బాయి తల్లి సంగటి పార్వతి, దళిత మహిళ చైర్మన్ నాగమల్లేశ్వరి, జ్యోతి, కాటికాపర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ జి కృష్ణ, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం నాయకుడు యాట ఓబులేసు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ అబ్దుల్లా, ప్రీతి తండ్రి రాజు నాయక్ మాట్లాడారు. అనంతరం సంస్కరణ సభ దగ్గర నుండి సెయింట్ జోసెఫ్ కాలేజ్, చిరంజీవి పార్క్, చిన్నపార్క్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ మీదుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే నిరసన సభ నిర్వహించారు. వీల్ చైర్ యాత్ర అమరావతికి వెళ్లడానికి పర్మిషన్ ఇవ్వని పోలీసులు సంస్కరణ సభ వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వెంటాడారు. పోలీసులు తమ సెల్ కెమెరాలతో ప్రీతి బాయి తల్లివెంట నడుస్తూ వెళ్తున్న మహిళలను, నాయకులను చిత్రీకరిస్తూ మఫ్టీ లో వారి మధ్య చేరి భయకంపితులను చేసే ప్రయత్నం చేశారు. ఓట్లు అయిపోయేదాకా ఓడ మల్లన్న అంటూ ఉపయోగించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేడు గెలిచి గద్దెనెక్కాక సమస్యను వినడానికి సైతం పర్మిషన్ ఇవ్వకపోవడం దారుణం అన్నారు. మంత్రి లోకేష్ రెడ్ బుక్ లో అణగారిన వర్గాలపై అఘాయిత్యాలకు పాల్పడిన ఉన్నతుల పేర్లు లేవా అని వారు ప్రశ్నించారు. అధికారులు స్పందించకపోవడంతో పర్మిషన్ కోసం కోర్టుకు వెళ్లానని, జరిగిన అన్యాయంపై మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యంలో గొంతు నొక్కడమేనన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం భాస్కర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు హుస్సేన్ బాషా, న్యాయవాది రఘు తదితరులు పాల్గొన్నారు.



- ప్రశ్నించిన ప్రజా సంఘాల నాయకులు.
- వీల్ చైర్ యాత్రకు పరిమిషన్ ఇవ్వని పోలీసులు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

స్వతంత్రశక్తిని కోల్పోతున్న ఇసి

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికల సంఘం (ఈసీఐ) వెన్నెముక వంటిది. ఇది స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికల నిర్వహణకు పూనుకునే ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా పేరు పొందింది. అయితే గత కొన్నేండ్లుగా ఈ కీలకమైన సంస్థ విశ్వసనీయత, స్వయంప్రతిపత్తిపై తీవ్రమైన ప్రశ్నలు ఉత్పన్నమవు తున్నాయి. ప్రతిపక్ష నాయకులు, పౌరసమాజ సంస్థలు, చివరికి న్యాయ వ్యవస్థ కూడా ఈసీఐ తీసుకుంటున్న కొన్ని విధాన నిర్ణయాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒకప్పుడు టీఎన్ శేషన్ వంటి ఎన్నికల కమిషనర్ల హయాంలో ఈసీఐ నిష్పాక్షికతకు, కఠినత్వానికి మారుపేరుగా నిలిచింది. రాజకీయ పార్టీలు బూత్ క్యాప్చరింగ్‌కు భయపడి, ఈసీఐ అంటే వణికిపోయేవి. ప్రస్తుతం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. రాహుల్‌గాంధీ ఆరోపణలు కేవలం రాజకీయ ప్రకటనలు కాకుండా, కొన్ని నిర్దిష్ట ఉదాహరణలు, గణాంకాల ఆధారంగా రూపొందించబడ్డాయి. వీటిని పరిశీలించడం ద్వారా, ఈసీఐ ఇటీవలి వివాదాస్పద విధానాలను ఉదాహరణకు, సీసీటీవీ ఫుటేజీలను ధ్వంసం చేయడం, బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, వాటి చట్టపరమైన, రాజ్యాంగపరమైన చిక్కులను లోతుగా అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంలోనూ గత సర్కార్‌కు అనుకూలంగా రాష్ట్ర ఎన్నికల సంఘం వ్యవహరించిందని అప్పట్లో అనేక విమర్శలు వెల్లువత్తాయి. ఇవన్నీ పోల్చిచూస్తే, ఎన్నికల సంస్థల స్వతంత్రతపై అనేక ప్రశ్నలు సమాజంలో లేవనెత్తుతున్నాయి. సీఐ, అధికార పార్టీ మధ్య 'ఓటు దొంగతనం' జరిగిందని, అది ఒక 'నేరపూరితమైన కుట్ర' అని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన ముఖ్యంగా మహారాష్ట్ర, కర్నాటక ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా చూపించారు. మహారాష్ట్రలో లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఓటరు జాబితాలో ఒక కోటి కొత్త ఓటర్లు చేర్చబడడంపై రాహుల్ గాంధీ సందేహాలు వ్యక్తం చేశారు. ఈ సంఖ్య గత ఐదేండ్లలో నమోదైన ఓటర్ల పెరుగుదల కంటే ఎక్కువగా ఉండడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. లోక్‌సభ ఎన్నికల్లో మహావికాస్ అఘాడి కూటమి మెజారిటీ స్థానాలు గెలుచుకుంటే, కేవలం కొన్ని నెలల తర్వాత జరిగిన విధానసభ ఎన్నికల్లో కూటమి తుడిచిపెట్టుకుపోవడం ఈ ఆరోపణలకు విశ్వసనీయతను పెంచుతుంది. కర్నాటకలో 'ఓటు దొంగతనం'పై తన వాదనను నిరూపించడానికి రాహుల్ గాంధీ కర్నాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌ను ఒక కేస్‌స్టడీగా చూపించారు. ఆరు నెలల పరిశోధన తర్వాత, ఈ నియోజకవర్గంలో 1,00,250 'నకిలీ ఓట్లు' ఉన్నాయని ఆయన గణాంకాలతో సహా నివేదించారు. ఈ ఆరోపణలు కేవలం 32,707 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి పీసీ మోహన్ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందడమనే వాస్తవం ఈ ఆరోపణల తీవ్రతను పెంచుతుంది. ఆరోపించబడిన నకిలీ ఓట్ల సంఖ్య, గెలుపు మార్జిన్ కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండడం ఈ ఆరోపణల ప్రాముఖ్యాన్ని నొక్కి చెబుతోంది. అలాగే బీహార్‌లో దాదాపు 80 మిలియన్ల మంది ఓటర్ల పత్రాలను తిరిగి పరిశీలించేందుకు ఈసీఐ చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) ప్రక్రియపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీని ప్రధాన ఉద్దేశం అనర్హులైన ఓటర్లను, ముఖ్యంగా "విదేశీ అక్రమ వలసదారులను" తొలగించడమేనని ఈసీఐ పేర్కొంది. కానీ, వివాదాస్పదమైన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్ సీ)ను పరోక్షంగా అమలు చేయడమేనని చాలా మంది భావిస్తున్నారు. బీహార్‌లో నిరక్షరాస్యత రేటు తక్కువగా ఉండడం (62శాతం), చాలామందికి జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల, ఈ ప్రక్రియలో పేద, అట్టడుగు వర్గాల ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది. రాహుల్‌గాంధీ ఆరోపణల ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవడానికి, గతంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని వచ్చిన ఆరోపణలను పోల్చి చూడడం ఉపయోగపడుతుంది. ఈ ఉదాహరణ ఓటరు జాబితాలో అక్రమాలు, సంస్థాగత పక్షపాతం వంటి సమస్యలు కేంద్ర ఎన్నికల సంఘానికి మాత్రమే పరిమితం కాలేదని చూపుతుంది. 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, రాష్ట్ర ఓటరు జాబితా నుంచి దాదాపు 30 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని ఒక ఆర్టీఐ వెల్లడించింది. నేషనల్ ఎలక్టోరల్ రోల్ ప్యూరిఫికేషన్ అండ్ అథెంటికేషన్ ప్రోగ్రాం (ఎన్ఈఆర్ పీఏపీ) కింద ఆధార్‌ను ఓటర్ ఐడీలతో అనుసంధానించే ప్రక్రియలో భాగంగా ఈ తొలగింపులు జరిగాయి. ఈ తొలగింపులకు ముందు 'డోర్-టు-డోర్ వెరిఫికేషన్' సరిగ్గా జరగలేదని, తగిన తనిఖీ లేకుండానే తొలగింపులు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. అప్పటి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) బన్వర్ లాల్, ఈసీఐకి రాసిన లేఖలో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో ఈ ప్రక్రియ సరిగ్గా జరగలేదని స్వయంగా పేర్కొన్నారు. ఈ తొలగింపులు అధికార పార్టీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అప్పటి ముఖ్యమంత్రి, గేటర్ హైదరాబాద్ నుంచి పదిహేను లక్షల "బోగస్ ఓటర్లను" తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించారని ఆరోపణలు వచ్చాయి. ఇది అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారని భావించిన ఓటర్లను తొలగించడానికి చేసిన కుట్రగా భావించారు. ఈ వివాదం ఈసీఐ ఇప్పుడు బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియకు ఒక పూర్వ ఉదాహరణగా నిలుస్తుంది. ఈసీఐ పారదర్శకత లేకపోవడం, ముఖ్యంగా సీసీటీవీ ఫుటేజీలను ధ్వంసం చేయడం, డిజిటల్ ఓటరు జాబితాను నిరాకరించడం వంటి చర్యలు 'ఓటు దొంగతనం' అనే ఆరోపణలను మరింత బలోపేతం చేస్తున్నాయి. ఒకవైపు ఈసీఐ తన చర్యలను చట్టపరమైన, సాంకే తిక వాదనలతో సమర్థిస్తుంటే, మరోవైపు ఈ విధానాలు ఎన్నికల ప్రక్రియను కోర్టులో సవాలు చేయడాన్ని కష్టతరం చేస్తున్నాయి. ఈ చర్యలు కేవలం ప్రమాణాలను మార్చడమే కాకుండా, న్యాయ వ్యవస్థ పర్యవేక్షణను కూడా అడ్డుకుంటున్నాయి. దీనివల్ల ప్రజలు తమ ఎన్నికైన ప్రభు త్వాలపై, చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థపైనే నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. ఎన్నికలు అక్రమంగా జరుగుతున్నాయని ప్రజలు భావించడం మొదలుపెడితే, అది ప్రజాస్వామ్య మూలాలనే బలహీనపరుస్తుంది. ఈసీఐ వంటి సంస్థల విశ్వసనీయత కోల్పోవడం, ఎన్నికల ఫలితా లను కోర్టులో సవాలు చేయడానికి సరైన సాక్ష్యాలు లేకుండా పోవడంతో, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు సుదీర్ఘకాలం పాటు హానికరం. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తును పరిరక్షించడానికి, ఈసీఐ స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించడం అత్యవసరం. దీనికి కొన్ని తక్షణ సంస్కరణలు అవసరం. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో అధికార పార్టీ ప్రభావం లేకుండా చూసి, సుప్రీంకోర్టు సూచించినట్లుగా నిష్పాక్షికమైన కమిటీని ఏర్పాటు చేయాలి. ఓటరు జాబితాలను యంత్ర పఠన ఫార్మాట్‌లో ప్రతిపక్ష పార్టీలకు, పౌర సంస్థలకు అందించడంతోపాటు ఎన్నికల ఫుటేజీలను శాస్త్రీయ, సురక్షితమైన పద్ధతిలో ఎక్కువ కాలం భద్రపరచాలి. ఈసీఐ తన విధానాలపై పౌరసంస్థలు, ప్రజలు వ్యక్తం చేసే ఆందో ళనలకు కేవలం చట్టపరమైన, సాంకేతిక ప్రతిస్పందనలతో సరిపెట్టకుండా, లోతైన విచారణలు, సంప్రదింపులను చేపట్టాలి. ఈ చర్యలు మాత్రమే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని పునరుద్ధరించి, భారత ప్రజాస్వామ్య పవిత్రతను కాపాడగలవు. లేకుంటే దేశంలో ఎన్నికలు కేవలం ఒక ఉత్సవంగా మాత్రమే మిగిలిపోయి, ప్రజాస్వామ్యానికి ప్రధాన భూమికగా ఉండబోవనే భయం నిజమవుతుంది.

## త్వరితగతిన పనులు పూర్తి చేయండి.. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మన గళం బనగానపల్లె : నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు , మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యవేక్షించడం జరిగింది. పర్యవేక్షన అనంతరం అధికారులతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను, పాత బస్టాండ్ సమీపంలో రోడ్డు కు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, ముస్లిం మైనార్టీల కోసం నిర్మిస్తున్న షాదీ ఖానా భవనంను పరిశీలించడం జరిగింది.

## సీఎం చంద్రబాబును కలిసిన ఆకెపోగు ప్రభాకర్

మనగళం, నెట్ వర్క్ : టీడీపీ జాతీయ అధ్యక్షులు, సీఎం నారా చంద్రబాబు నాయుడని ఆయన గృహంలో యస్.సి కోఅపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. యస్.సి కోఅపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కల్పించినందుకు ఈ సందర్భంగా ఆకెపోగు సీఎంకు ధన్యవాదములు తెలిపారు. అనంతరం చంద్రబాబకు ఆకెపోగు శాలువా కప్పి సత్కరించారు.



## మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఎంపీ సానా సతీష్



మనగళం, నెట్ వర్క్ : ఢిల్లీలో మంత్రి నారా లోకేష్ ను ఎంపీ సానా సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ సానా సతీష్ జన్మదినం కావడంతో నారా లోకేష్ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ సానా సతీష్ ఉన్నత పదవుల్లో కొనసాగాలని నారా లోకేష్ ఆకాంక్షించారు.

## ఫుడ్ పాయిజన్ పై సమగ్ర విచారణ జరిపించాలి

మనగళం, ఓర్వకల్లు : ఓర్వకల్ మండలంలోని ఎస్సీ వసతి గృహం లో జరిగిన ఫుడ్ పాయిజన్ పై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కర్నూల్ నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మనోహర్ కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డెన్, వంట మనసుల నిర్లక్ష్యం మూలంగా ఫుడ్ పాయిజన్ జరిగిందని, విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అభి సి. అశోక్, నాయకులు కావ్య, మధు,సుశాంత్, వినోద్ తదితరులు,పాల్గొన్నారు.



## వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులను రానీయొద్దు

మనగళం, ఎమ్మిగనూరు : ట్రంప్, మోడీ అవలంభిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్ లో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షులు మాలిక్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆ సంఘం జిల్లా కార్యదర్శి పంపన గౌడ్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందాల కారణంగా వ్యవసాయ రంగం పూర్తిగా క్షీణించడమే ఆర్థిక పరిస్థితి దిగజారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ తో చేసుకున్న ఒప్పందాలు ప్రదాని మోడీ రద్దు చేసుకోవాలని, వ్యవసాయ రంగాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులను




రానీయొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శులు రాజీవు, శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు మద్దిలేటి నాయుడు, ఏఐటీయూసీ అధ్యక్ష,ఉపాధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, విజయేంద్ర, తిమ్మ గురుడు, కాజా, ఇస్మాయిల్, మల్లికార్జున గౌడ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ యోజన కిట్లు అందజేత

మనగళం, కోడుమూరు : పీఎమ్ విశ్వకర్మ యోజన కిట్లను కోడుమూరు అసెంబ్లీ ఇన్ చార్జ్ వేల్పుల గోపాల్, రూరల్ మండల అధ్యక్షుడు బెస్తఈరన్న బీజేపీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. వేల్పుల గోపాల్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టినటు వంటి పీఎం విశ్వకర్మ యోజన భాగంగా 18 రకాల చేతివృత్తుల వారికి వృత్తి పనులకు ప్రత్యేకంగా నెలరోజులు స్కిల్ డెవలప్మెంట్ కోర్సు ఇస్తున్నామన్నారు. గౌరవ వేతనం అందజేస్తూ చేతి వృత్తి పనుల ద్వార జీవనం సాగిస్తున్నటువంటి వారికి కిట్లు అందజేస్తున్నామని చెప్పారు. లబ్ది దారుడు పెయింటర్ మద్దిలేటికి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో యస్ యన్ రసూల్, రాజు, వెంకటేష్, యేసన్న, విజయ్ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.



## మంత్రి బీసీ జనార్థన్ రెడ్డిని కలిసిన బనగానపల్లె ఎస్సై .

మన గళం బనగానపల్లె : రాష్ట్ర రోడ్ల మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కార్యాలయం లో మంగళవారం మర్యాదపూర్వకంగా బనగానపల్లె ఎస్సై టి.కల్పన కలవడం జరిగింది.బనగానపల్లె పట్టణ నూతన ఎస్సైగా భాద్యతలు స్వీకరించిన క్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలవడం జరిగింది.మంత్రి ఎస్ ఐ తో బనగానపల్లె పట్టణంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు రక్షణ కల్పించడం, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని సూచించారు.



## కృష్ణమ్మ సోయగాలు చూడతరమా..!
## శ్రీశైలం డ్యాం విద్యుత్ వెలుగులు

మనగలం : శ్రీశైలం డ్యాం శ్రీశైలం డ్యాం వద్ద పది గేట్ల ద్వారా పరుగులెడుతున్న కృష్ణమ్మ సోయగాలను తిలకిస్తూ సందర్శకులు మంత్రముగ్ధులవుతున్నారు. దట్టమైన నల్లమల కొండల నడుమ పరవళ్లు తొక్కుతూ.. సాగర్ వైపు పరుగులెడుతున్న కృష్ణమ్మ అందాలను తిలకిస్తూ.. శ్రీశైలం పరిసరాల్లో కురుస్తున్న చిరుజల్లులు తడుస్తూ.. సందర్శకులు డ్యాం వద్ద ఫోటోలు దిగుతూ సందడి చేస్తున్నారు.



# స్వర్ణరథోత్సవం





మనగళం శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (19.08.2025) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. వర్ష సూచన కారణంగా ఆలయ ముందుభాగాన గంగాధర మండపం చుట్టూ ఈ రథోత్సవం జరిపించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. తరువాత రథోత్సవం జరిపించబడింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈనాటి ఉత్సవంలో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి యం. హరిదాసు, అర్చకస్వాములు, వేదపండితులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (19.08.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.





## కోడుమూరు మండలం లోని ముడుమలకుర్తి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలం లోని ముడుమలకుర్తి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించబడినది. జి మనోహర్ పొలంలో ప్రతి పంటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించబడినది

ఈ సందర్భంగా కోడుమూరు అగ్రికల్చర్ ఆఫీసర్ రవి ప్రకాష్ మాట్లాడుతూ అధిక వర్షాలకి పత్తి పంటలో నీరు నిల్వ ఉన్నచో వాటిని కాలువల ద్వారా బయటికి పంపాలి అలాగే ప్రతి పంటలో ఎరుపు రంగు ఆకులను గమనించడం జరిగినది, నివారణకు గాను ఎకరాకు బోరాన్ 250 గ్రాములు మెగ్నీషియంను ఎకరాకు కేజీని స్ప్రే చేయవలసిందిగా మండలంలోని రైతులకు ఈ సందర్భంగా ఎంఏఓ తెలియజేశారు నీరు ఎక్కువగా ఉన్న ప్రతి పొలాలలో పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసిన ఎడల మంచి దిగుబడులు వస్తాయని రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు ప్రతి కాయ కుళ్ళు తెగులు ఎక్కువగా ఆశించకుండ కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాల్సిందిగా రైతులందరూ ఈ సూచనలు అన్నింటిని పాటిస్తే మంచి దిగుబడులు



వస్తాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు

## కోడుమూరు వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో వీడియో గ్రాఫర్స్ దినోత్సవ వేడుకలు

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో ఎద్దుల కాంప్లెక్స్ నందు మంగళవారం నాడు ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం వేడుకలను కోడుమూరు ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసుకోవడం జరిగినది ఆ సందర్భంగా ఫోటోగ్రాఫర్ గౌరవ అధ్యక్షులు ఎద్దుల మహేశ్వర్ రెడ్డి చేతుల మీదగా చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం చేసి కోడుమూరు స్నేహ వృధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది ఆ సందర్భంగా ఎద్దుల మహేశ్వర్ రెడ్డి సూర్య మాట్లాడుతూ కోడుమూరు ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ మంచి అభివృద్ధిలోకి ఫోటో వీడియో గ్రాఫర్ లో రావాలని ఇప్పటికీ ప్రపంచంలో ఉన్న టెక్నాలజీని మించి ఫోటోగ్రాఫర్లు ముందుకు పోతున్నారని అన్నారు ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ అందరికీ వారు శుభాకాంక్షలు తెలియజేశారు ఇందులో భాగంగా ఫోటోగ్రాఫర్ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఈ తరంలో డిజిటల్ టెక్నాలజీలో ఎన్నో రకాల సెల్ ఫోన్లు వచ్చిన ఫోటో గ్రాఫర్లను వదలకుండా గత మాన్యువల్ ఫోటో నుండి డిజిటల్ టెక్నాలజీ వరకు ఫోటోగ్రాఫర్ రంగంలో ఉండడమంటే కూడా ప్రతి ఒక్కరూ చేసుకున్న అదృష్టమని అన్నారు ఈ కార్యక్రమంలో కోడుమూరు ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ రాజు నాగేష్



మన్సూరు నబి మహేష్ కలం బుజ్జి నాగరాజు అశోకు షేక్షావలి హనుమన్న శివ భాష మల్లేష్ అభి తదిపరులు పాల్గొన్నారు

## నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (19.08.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. 69 తరువాత సందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

## నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

మనగళం, కర్నూలు సిటీ : నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయిబాబా గుడి, బస్టాండ్, మార్కెట్ కూడలి, వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్న సాధువులు,నిరాశ్రయులకు, సుందరయ్య కాలనీ పెదలకు అల్పాహారం పూరీలు, వాటర్ బాటిల్స్ పంపిణీ జరిగింది. మైదుకూరుచెందిన దివంగత గోవిందు రామ సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య అన్నపూర్ణమ్మ, కుమారులు రామ్మోహన్ రెడ్డి, జయ భరత్ రెడ్డి, కోడళ్ళు రాధికా రెడ్డి, స్రవంతి, మనవరాలు రుదిక్ష రెడ్డి సహకారంతో పేదలకు నేస్తం సేవా సంస్థ సభ్యులు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో వన్నెంపల్లె ఉపేంద్ర కుమార్, చెన్నకేశవ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (19.08.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్ట దోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.



# యూరియా పంపిణీ లో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

మనగళం, కర్నూలు సిటీ : యూరియా పంపిణీ లో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో యూరియా ఎన్ఫోర్స్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. యూరియా పంపిణీపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియాను రైతులకు పంపిణీ చేయకుండా అక్రమంగా మళ్లిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ షాపుల్లో అధిక ధరలకు అమ్మినా, లింకేజీలు పెట్టినా కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. బార్డర్ చెక్ పోస్టుల్లో విజిలెన్స్, పోలీసు, రవాణా శాఖ అధికారులతో టీములను ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వాడేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వచ్చిన యూరియాను ఏ ఏ మండలాల్లో అవసరం ఉందో ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ముందుగానే టోకెన్ లు పంపిణీ చేసిన విషయం ప్రస్తావిస్తూ, వ్యవసాయ శాఖ అధికారులు యూరియా పంపిణీ లో పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, అగ్రికల్చర్ జెడి వరలక్ష్మి, రాజు డిస్ట్రిక్ట్ మేనేజర్ మార్కెటింగ్, డీఎస్ఓ రాజా రఘువీర్, డీటీసీ శాంత కుమారి, డీడీ ఫిషరీస్ రంగనాథ్ బాబు, డీఎం సివిల్ సప్లైస్ వెంకట రాముడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పాల్గొన్నారు.



– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

# శ్రీశైలం డ్యాం నుడి వరద ప్రవాహం

మనగళం శ్రీశైలం : శ్రీశైలం జలాశయానికి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో నిన్నటి నుంచి డ్యామ్ 10 గేట్లను 10 అడుగుల ఎత్తి నీటిని విడుదల ప్రారంభించిన అధికారులు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు 10 గేట్లను 14 అడుగుల ఎత్తుకు పెంచారు. ప్రస్తుతం శ్రీశైలానికి 3,42,417 క్యూసెక్కుల వరద వచ్చి చేరగా.. 10 గేట్లు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4,10,924 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేశారు.



# గిరిజన సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

మనగళం శ్రీశైలం : చెంచు గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి కొమరం భీమ్ ఆదివాసీ చెంచు గిరిజన సంఘం అధ్యక్షుడు ఆశీర్వాదం వినతి పత్రం సమర్పించారు. శ్రీశైలం వచ్చిన మంత్రిని కలిసి గిరిజన సమస్యలు విన్నవించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని జిల్లాలోని గిరిజన గుడాల్లో నూతన గృహాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మంత్రి వెంట టీడీపీ శ్రీశైల మండల ఇన్చార్జ్ వై.యుగంధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.





# ఒంటెడుదిన్నెలో ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు

మనగళం, గోనెగండ్ల : ధర్మము వలన అర్థముతో పాటు సకల సౌఖ్యాలు కలుగుతాయని, ధర్మము వలననే ఈ సమస్థ ప్రపంచం ఆధారపడి ఉన్నదని, అటువంటి ధర్మాచరణ ప్రతి వ్యక్తి కర్తవ్యమని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మా ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం, ఒంటెడుదిన్నె గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ప్రారంభం సందర్బంగా ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం సి తులశమ్మ, డమాం జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కెశవరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు కె. ఉపేంద్ర రెడ్డి, భజన మండలి అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి సంజీవరెడ్డి, ఈశ్వర్, జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్ నాగేశ్వరప్ప, గ్రామ పెద్దలు జి లక్ష్మీ కాంత్ రెడ్డి, జివి రాంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కె చంద్రశేఖర్ రెడ్డి, వీరప్ప, భక్తులు పాల్గొన్నారు.




# సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (19.08.2025) శ్రీ ఎస్.నటరాజడాన్స్ అకాడమి, కడప వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. శివతాండవం, ఈ కార్యక్రమములో మహాగణపతిం, శివపార్వతీ కల్యాణం, ఆనందతాండవం, మహిషాసురమర్ధిని తదితర గీతాలకు చిన్న, జయశ్రీ, కాంత్రికుమార్, గణేష్,యోగి తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన పరిరక్షణలో భాగంగా సంప్రదాయ కళల నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు

# నంద్యాల జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖలు మరియు గిరిజన సంక్షేమ శాఖ కమిటీలు చేపట్టిన కార్యక్రమాలపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమీక్ష నిర్వహించారు.

మనగళం శ్రీశైలం : జిల్లాలో 6 %×జణూ% ప్రాజెక్టుల పరిధిలో 1663 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా, వీటిలో 1620 ప్రధాన, 43 మినీ అంగన్వాడీలు ఉన్నాయి. 2 వర్కర్లు, 2 మినీ వర్కర్లు, 40 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని తక్షణమే భర్తీ చేయాలన్నారు. బాలసంజీవని పోషణ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. గర్భిణీలు, బాలింతలు, 6 నెలల నుండి 6 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా గుడ్లు, పాలు, మల్టిగ్రేన్ పిండి తదితర పోషకాహారం అందిస్తున్నారు. పథకాల ద్వారా లక్షలాది మంది లబ్ధిదారులు ఉపయోగం పొందారు. గత ఆరో నెలల్లో పిల్లల్లో పోషక లోపాలు తగ్గాయని మంత్రి తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు, ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. జిల్లాలోని 101 సాక్షం అంగన్వాడీల్లో ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. (పోషణ వటికాలు, వాటర్ ఫిల్టర్లు, %ూజుణ%






(స్క్రీన్లు). 2024లో ఏర్పడిన శిశు సంరక్షణ యూనిట్ ద్వారా ఈ ఏడాది 157 మంది పిల్లలు రక్షించబడ్డారు, బాల్య వివాహాలు, %ూజూూ%, బాల కార్మికత కేసుల్లో చర్యలు తీసుకున్నామని వివరించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా బాధిత మహిళలకు న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నారు. త్వరలో స్వంత భవన నిర్మాణం ప్రారంభమవుతుంది. "మహిళలు, పిల్లల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత. ఆధునిక వసతులతో అంగన్వాడీలను అభివృద్ధి చేస్తున్నాం. మహిళల రక్షణకు, మర్యాదకు కట్టుబడి పని చేస్తున్నాం"%-% మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.


# ఎల్ఐసీ పాలసీదారులకు సువర్ణావకాశం..!

మనగళం వైద్య, ఆరోగ్య అవసరాలపై ఎటువంటి రాయితీ ఉండదని కంపెనీ తన ప్రకటనలో తెలిపింది. ప్రీమియం చెల్లింపు కాలంలో గడువు ముగిసిన, పాలసీ వ్యవధి పూర్తి కాని పాలసీలను ఈ ప్రచారంలో తిరిగి ప్రారంభించవచ్చు.దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఒక పెద్ద ప్రకటన చేసింది. ప్రభుత్వ రంగ ఎల్ఐసి నిలిపివేసిన వ్యక్తిగత బీమా పాలసీని తిరిగి ప్రారంభించాలని ఒక ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఈ ప్రత్యేక ప్రచారం ఒక నెల పాటు నిర్వహించనుంది. నిలిపివేసిన బీమా పాలసీని తిరిగి ప్రారంభించాలని కోరుతూ ఆగస్టు 18న ఓ ప్రచారాన్ని ప్రారంభించింది ఎల్ఐసీ. ఈ ప్రచార కార్యక్రమం 2025 సెప్టెంబర్ 17 వరకు కొనసాగుతుంది. దీని పాలసీని తిరిగి ప్రారంభించడానికి ఆలస్య రుసుములో ఆకర్షణీయమైన డిస్కౌంట్లు అందించనుంది. ఈ పథకం కింద అన్ని నాన్-లింక్డ్ అంటే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ పథకాలకు ఆలస్య రుసుములపై 30 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు ఎల్ఐసి ఒక ప్రకటనలో తెలిపింది. పునరుద్ధరణకు అర్హత ఉంటే గరిష్టంగా రూ. 5000 వరకు ఉంటుంది. అదే సమయంలో మైక్రో ఇన్సూరెన్స్ పాలసీ (తక్కువ ఆదాయ కుటుంబం లేదా వ్యక్తికి బీమా పాలసీ) కోసం ఆలస్య రుసుములపై 100 శాతం తగ్గింపు ఇస్తున్నారు. ఈ ప్రత్యేక పునరుద్ధరణ ప్రచారం కింద పాలసీ నిబంధనలు, షరతులు నెరవేరితే మొదటి చెల్లించని ప్రీమియం తేదీ నుండి 5 సంవత్సరాలలోపు పాలసీని ప్రారంభించవచ్చు.

# అక్రిడిటేషన్ కమిటీ జీ.ఓ ను సవరించాలి

– షేక్ మస్తాన్ వలి, నవ్యాంధ్ర ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మన గళం కర్నూలు : రాష్ట్రంలో పలు పత్రికల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు మంజూరుకు సంబందించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీ.ఓ విడుదల చేసింది.ఈ జీ.ఓ, స్థానిక పత్రికలకు మేలు చేసేవిధం గా కాకుండా పత్రికలను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా ఉందని నవ్యాంధ్ర ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్ వలి అన్నారు.మంగళవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ,ప్రభుత్వం విడుదల చేసిన జీ.ఓ అస్తవ్యస్తంగా ఉందని అది కేవలం పెద్ద పత్రికలకు మేలు చేసే విధంగా ఉందన్నారు.ఈ ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీ.ఓ కంటే గత ప్రభుత్వం విడుదల చేసిన జీ.ఓ 142 లోనే స్థానిక పత్రికలకు మేలు జరిగిందన్నారు .గత ప్రభుత్వం లో 8 పేజీలతో రెగ్యలర్ గా నడిపిన పత్రికలకు కర్నూలు ఉమ్మడి జిల్లాలో 10 అక్రిడిటేషన్ ఉండగా ప్రస్తుత జీ.ఓ లో 6 అక్రిడిటేషన్ లు మాత్రమే మంజూరు చేసే విధంగా ఉందన్నారు.గత ప్రభుత్వం కంటే అధిక అక్రిడిటేషన్ లు మంజూరు చేస్తామని ఊదర గొట్టిన కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైందన్నారు .అలాగే పీరియయాడికల్స్(వార.పక్ష,మాస్ పత్రికలకు కు కూడా కేవలం ఒక్క అక్రిడిటేషన్ తోనే సారి పెట్టిందన్నారు.4,పేజీలకు,8పేజీలకు ఏమీ తేడా లేకుండా అందరిని ఒకే గాటిన కట్టిందన్నారు.8 పేజీలతో నెలకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్న పత్రికలకు న్యాయం జరగలేదన్నారు. 8పేజీలతో రెగ్యులర్ గా నడుపుతున్న పత్రికలకు జీ.ఓ ను సవరించి,నియోజక వర్గానికి ఒక్కొక్క అక్రిడిటేషన్ మంజూరు చేయాలని,అలాగే పీరియాడికల్స్ కు రెవిన్యూ డివిజన్ కు ఒకటి చొప్పున మంజూరు చేయాలని కోరారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ,అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన తెలిపారు.



# మధుమేహం ఉన్నవారు పిస్తా తింటే..

మన గళం,**ఆరోగ్యం :** ఈ కొవ్వులు డయాబెటిస్‌లో ప్రధాన కారకం అయిన మెరుగైన ఇన్సులిన్ సెన్సిటివిటీతో సంబంధం కలిగి ఉంటాయి. రక్తంలో చక్కెర నియంత్రణను మెరుగుపరుస్తుంది. పిస్తాలు కూడా ప్రోటీన్ అద్భుతమైన మూలం. భోజనం, చిరుతిళ్లలో ప్రోటీన్-రిచ్ ఫుడ్స్ చేర్చడం వల్ల ఆకలిని నియంత్రించడంలో, మధుమేహం ఉన్నవారిలో అతిగా తినకుండా చేస్తుంది.. పిస్తాపప్పులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఆక్సీకరణ ఒత్తిడి, మంటతో పోరాడటానికి సహాయపడతాయి. పోషకాలు పుష్కలంగా ఉన్న పిస్తాలు మొత్తం ఆరోగ్యానికి మంచివి. పిస్తా పప్పు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అయితే, మధుమేహం బాధితులు పిస్తా పప్పు తీసుకోవడం వల్ల షుగర్ లెవెల్స్ పెరుగుతాయా అనే అనుమానం చాలా మందిలో ఉంటుంది. అయితే ఇది నిజమా, లేదా అపోహ అనే విషయంలోకి వెళితే.. పిస్తాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి తక్కువ గ్లైసెమిక్ ఆహారాలు తినడం చాలా అవసరం. ఎందుకంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా కూడా ఇది సహాయపడుతుంది. పిస్తా వంటి తక్కువ +× ఆహారాలు రక్తంలో చక్కెర నియంత్రణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. పిస్తాలో కరిగే ఫైబర్ ఉంటుంది. ముఖ్యంగా కరిగే ఫైబర్ కారణంగా, ఫైబర్ గ్లూకోజ్ శోషణను తగ్గిస్తుంది. భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్పైక్‌లను తగ్గిస్తుంది. పిస్తాపప్పులో ఉండే ఫైబర్ బరువు నియంత్రణలో సహాయపడుతుంది. పిస్తాలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఈ కొవ్వులు డయాబెటిస్‌లో ప్రధాన కారకం అయిన మెరుగైన ఇన్సులిన్ సెన్సిటివిటీతో సంబంధం కలిగి ఉంటాయి. రక్తంలో చక్కెర నియంత్రణను మెరుగుపరుస్తుంది. పిస్తాలు కూడా ప్రోటీన్ అద్భుతమైన మూలం. భోజనం, చిరుతిళ్లలో



ప్రోటీన్-రిచ్ ఫుడ్స్ చేర్చడం వల్ల ఆకలిని నియంత్రించడంలో, మధుమేహం ఉన్నవారిలో అతిగా తినడాన్ని నిరోధించవచ్చు. పిస్తాపప్పులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఆక్సీకరణ ఒత్తిడి, మంటతో పోరాడటానికి సహాయపడతాయి.

## ఖాళీకడుపుతో జాజికాయ నీటిని తీసుకుంటే..

మన గళం,**ఆరోగ్యం :** వంటల తయారీలో విరివిగా ఉపయోగించే జాజికాయలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. జాజికాయలో యాంటీ బయోటిక్, యాంటీ ఫార్మాస్యూటికల్ గుణాలు అధికంగా ఉంటాయి. జాజికాయలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఐరన్, కాపర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. జాజికాయ కలిపిన నీటిని తాగితే చాలా మంచిది. ఖాళీ కడుపుతో జాజికాయ పొడిని నీటిలో కలిపి తాగడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీంతో జీర్ణవ్యవస్థతో పాటు, చర్మం, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. జాజికాయలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి. ఇవి కడుపు సమస్యల నుండి ఉపశమనం పొందడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. జాజికాయ నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మలబద్ధకం, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గుతాయి, మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జాజికాయలో అనాల్జేసిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి తలనొప్పి, మైగ్రేన్ దాడుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. జాజికాయ నీటిని ఉదయాన్నే తాగడం వల్ల తలనొప్పి, మైగ్రేన్ లక్షణాల నుండి గొప్ప ఉపశమనం లభిస్తుంది. జాజికాయలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది బాహ్య హానికరమైన పదార్థాలతో పోరాడటానికి శరీర సామర్థ్యాన్ని పెంచుతుంది. దీని వలన మీరు ఇన్ఫెక్షన్లకు తక్కువ అవకాశం ఉంటుంది. జాజికాయలో ఉండే ట్రిప్టోఫాన్ వంటి సహజ సమ్మేళనాలు మెదడుపై శాంతించే ప్రభావాన్ని కలిగి ఉంటాయి. జాజికాయ నీటిని తాగడం ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఇది నిద్రలేమితో బాధపడేవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. జాజికాయలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు చర్మాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచడంలో సహాయపడతాయి. ఇది మొటిమలు, ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. జాజికాయ నీటిని తాగడంతో చర్మ సౌందర్యం మెరుగుపడుతుంది. జాజికాయ నీటిని తాగితే మొటిమలు తగ్గుతాయి. ముడతలు రావు.

## ఫూల్ మఖానా పాలలో కలిపి తింటే..

మన గళం,**ఆరోగ్యం :** శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఇందుకోసం పోషక విలువలున్న పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలి. ఇందులో భాగంగా చాలా మంది ప్రజలు పాలు, మఖానా కలిపి తినడానికి ఇష్టపడతారు. దీని కారణంగా శరీరంలో అనేక మార్పులు కనిపించడం ప్రారంభిస్తాయి. మఖానాలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి తక్షణ శక్తిని ఇస్తాయి. పాలలో శక్తిని ఇవ్వడానికి సహాయపడే పోషకాలు కూడా వీటిలో ఉంటాయి. ఈ రెండింటినీ కలిపి తినడం వల్ల మీకు మరింత శక్తి లభిస్తుంది. మఖానాలో తగిన మోతాదులో ప్రోటీన్ ఉంటుంది. దీన్ని పాలలో కలిపి తీసుకోవడం వల్ల కండరాలు దృఢంగా మారతాయి. ఇది శరీరం బలహీనతను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. మెగ్నీషియం, పొటాషియంతో సహా అనేక పోషకాలు ఇందులో ఉన్నాయి. అదే సమయంలో పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మఖానాలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. పాలలో కలిపి తింటే జీర్ణక్రియ ఆరోగ్యంగా ఉంటుంది. అంతే కాకుండా మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. మీరు రాత్రి నిద్రపోకపోతే, మఖానాను పాలలో కలిపి తినండి. మెగ్నీషియం, పొటాషియం ఇందులో ఉంటాయి. ఇవి నిద్రను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మఖానాను పాలతో కలిపి తీసుకుంటే గుండెకు మేలు జరుగుతుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వీటిలో తక్కువ క్యాలరీ కంటెంట్ ఉంటుంది. మఖానాను పాలతో కలిపి తీసుకుంటే పొట్ట ఎక్కువసేపు నిండుగా ఉంటుంది, దీనివల్ల బరువు తగ్గుతారు. మఖానాలో అధిక మొత్తంలో ప్రోటీన్ ఉంటుంది. ఇది కండరాల అభివృద్ధికి సహాయపడుతుంది. మఖానాలో ఫాస్పరస్, మెగ్నీషియం ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. దీన్ని రోజువారీ స్నాక్స్‌గా తీసుకోవచ్చు. అంతేకాదు.. ఫూల్ మఖానాలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మఖానాలో స్పెర్మ్ నాణ్యత, కౌంట్ మెరుగుపరిచే లక్షణాలు ఉన్నాయి.



## రుక్మిణి వసంత్.. వెయ్యి కోట్ల హీరోయిన్

మన గళం, సినిమా కన్నడ హీరోయిన్ రుక్మిణి వసంత్ సప్తసాగారాలు దాటి సైడ్ ఏబి ఇతర భాషల్లో అంత విజయం సాధించకపోయినా తనకొచ్చిన పేరు మాత్రం చాలా పెద్దది. తర్వాత చేసిన సినిమాలు ఆశించిన విజయం సాధించనప్పటికీ ఆఫర్లు మాత్రం ఆగడం లేదు. నిఖిల్ అప్పుడో ఇప్పుడో ఎప్పుడో, విజయ్ సేతుపతి ఏస్ దారుణంగా బోల్తా కొట్టినా తనకేం తేడా జరగలేదు. శ్రీమురళి బఘీరా ఫ్లాప్ కాగా శివరాజ్ కుమార్ భైరతి రణ్గల్ ఓ మోస్తరుగా కర్ణాటకలో ఆడింది. ఇప్పుడు తన చేతిలో జూనియర్ ఎన్టీఆర్ – ప్రశాంత్ కాంబో మూవీ ఉంది. షూటింగ్ ఇప్పటికే మొదలుపెట్టిన ఈ యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది జూలైలో విడుదల కానుంది. రాబోయే అక్టోబర్ 2 విడుదల కాబోయే కాంతార చాప్టర్ 1లోనూ నటించి మరో బంపర్ ఆఫర్ కొట్టేసింది. హీరో కం దర్శకుడు రిషబ్ శెట్టి ఆమెకు పవర్ ఫుల్ క్యారెక్టర్ ఇచ్చినట్టు టాక్ ఉంది. ఇవి కాకుండా తాజాగా యష్ టాక్సిక్ లోనూ ఛాన్స్ కొట్టేసినట్టు ముంబై అప్డేట్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ గ్యాంగ్ స్టర్ డ్రామాలో హీరోయిన్ కియారా అద్వానీ కాగా ఇప్పుడు రుక్మిణి వసంత్ పేరు వినిపించడం చూస్తుంటే యష్ కి జోడిగా ఇద్దరు భామలు ఉంటారనే విషయం అర్థమవుతోంది. నయనతార, హ్యూమా ఖురేశీ, తారా సుతారియా ఇతర తారాగణం కాగా మార్చి రిలీజ్ కు రెడీ చేస్తున్నారు. ఇవి కాకుండా శివ కార్తికేయన్ సరసన ఒక తమిళ మూవీ రుక్మిణి వసంత్ ఖాతాలో ఉంది. వాస్తవానికి తారక్ నీల్ సినిమా ఒప్పుకున్నప్పుడు అది రిలీజయ్యే దాకా ఇంకే కమిట్ మెంట్స్ ఇవ్వకూడదనే నిబంధన రాసుకునట్టు అప్పట్లో టాక్ వచ్చింది.

# కియారా అద్వానీకి అయిదో షాక్



మన గళం, సినిమా : అందం, హిట్లు రెండు ఉన్న లక్కీ హీరోయిన్‌గా మొన్నటిదాకా మంచి ఊపు మీదున్న కియారా అద్వానీకి బాక్సాఫీస్ వద్ద వరస షాకులు తగులుతున్నాయి. ఒకటి రెండు ఏకంగా అయిదు ఫ్లాపులు క్యూ కట్టడంతో పారితోషికం పరంగా నెలకొన్న డిమాండ్ క్రమంగా తగ్గిపోయేలా ఉంది. చివరి సక్సెస్ తనకు 2022లో ‘భూల్ భులయ్యా 2’తో దక్కింది. దాని విజయంలో హీరో కార్తీక్ ఆర్యన్ దే ప్రధాన పాత్ర అయినప్పటికీ కియారాకు కూడా పేరు తీసుకొచ్చింది. ఆ తర్వాత కామెడీ ఎంటర్ టైనర్ ‘జగ్ జగ్ జియో’ అంతంతమాత్రంగానే ఆడింది. ఎన్నో వాయిదాలు పడుతూ వచ్చిన విక్కీ కౌశల్ ‘గోవిందా మేరా నామ్’ ఫలితం కూడా సోసోనే. మొన్నటి ఏడాది ‘సత్యప్రేమ్ కీ కథ’ కొన్ని ఏ సెంటర్స్ ఓ మోస్తరుగా ఆడినప్పటికీ ఓవరాల్ గా చూసుకుంటే నిరాశే కలిగించింది. నిన్న జనవరిలో రిలీజైన ‘గేమ్ ఛేంజర్’ గురించి చెప్పనక్కర్లేదు. వినయ వినయ విధేయ రామ కాంబోని రిపీట్ చేస్తూ రామ్ చరణ్ కి జోడి కడితే రిజల్ట్ కూడా మళ్ళీ పునరావృత్తమయ్యింది. తాజాగా వార్ 2 ఏమాయ్యిందో కళ్ళముందు కనిపిస్తోంది. బికినీ షాట్ తప్ప తన గురించి మాట్లాడుకోవడానికి ఏం లేకుండా పోయింది. పెర్ఫార్మన్స్ కోసమన్నట్టు ఓ రెండు ఫైట్లు, ఎమోషనల్ సీన్లు పెట్టారు కానీ వర్కౌట్ కాలేదు. ఇప్పుడు తన చేతిలో ఉన్న ప్యాన్ ఇండియా మూవీ కెజిఎఫ్ యష్ చేస్తున్న టాక్సిక్ ఒకటే.ఇటీవలే తల్లి హోదాలోకి ప్రవేశించిన కియారా అద్వానీ కొంత గ్యాప్ తీసుకుని కెరీర్ మీద మళ్ళీ ఫోకస్ పెంచబోతోంది. గ్లామర్ షోకు ఏ మాత్రం మొహమాటపడనని వార్ 2 లో చెప్పేసింది కనక ఆ కోణంలో వాడుకునేందుకు దర్శకులు రెడీ అవుతున్నారు. కెరీర్ ప్రారంభంలో భరత్ అనే నేను, కబీర్ సింగ్, ఎంఎస్ ధోని లాంటి వరస సక్సెస్ లు చూశాక ఇప్పుడిలా ఫ్లాపులు రావడం ఫ్యాన్స్ ని కలవరపెడుతోంది.



# అతడి వైపు తారక్ అభిమానుల చూపు

మన గళం, సినిమా : పదేళ్ళ వెనక్కి వెళ్తే వరుస ఫ్లాపులతో జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఓ మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్న అతడికి పూరి జగన్నాథ్ ‘టెంపర్’ రూపంలో బ్రేక్ ఇచ్చాడు. ప్రి రిలీజ్ ఈవెంట్లో తారక్ మాట్లాడుతూ.. ఇకపై అభిమానులు తలెత్తుకునే సినిమాలే చేస్తా అంటూ స్టేట్మెంట్ ఇచ్చిన తారక్.. ఆ మాటను నిలబెట్టుకుంటూనే సాగాడు. దశాబ్ద కాలం పాటు అతడికి అపజయమే లేదు. టెంపర్ తర్వాత నాన్నకు ప్రేమతో, జనతా గ్యారేజ్, జై లవకుశ, అరవింద సమేత, ఆర్ఆర్ఆర్, దేవర చిత్రాలతో విజయాలందుకున్నాడు తారక్. వీటిలో కొన్ని సినిమాలు బ్లాక్‌బస్టర్లు అయ్యాయి. కొన్ని ఓ మోస్తరుగా ఆడాయి. కానీ ఏదీ ఫెయిల్యూర్ మాత్రం కాదు. ఇలా పదేళ్ల పాటు సక్సెస్ స్ట్రీక్ కొనసాగించిన టాప్ స్టార్ టాలీవుడ్లో మరొకరు లేకపోవడం గమనార్హం. ఐతే ఫిలిం ఇండస్ట్రీలో అపజయాలకు అతీతంగా సాగే వాళ్లు అరుదు. అందుకు తారక్ కూడా మినహాయింపు కాలేకపోయాడు. ‘వార్-2’తో తారక్ సక్సెస్ స్ట్రీక్‌కు బ్రేక్ పడిపోయింది. ‘వార్-2’కు తొలి రోజు వచ్చిన టాక్ చూస్తేనే సినిమా నిలబడడం కష్టమని అర్థమైపోయింది. ఐతే హాలిడే వీకెండ్ కావడంతో ఆదివారం వరకు ఓ మోస్తరు వసూళ్లు రాబట్టింది. సోమవారం ఉదయం షోలు చూస్తేనే ఇక కష్టమని అర్థమైపోయింది. తారక్ ఫ్యాన్స్ కూడా ఈ సినిమా నుంచి మూవ్ ఆన్ అయిపోక తప్పదు. ‘వార్-2’తో బాలీవుడ్లో తన సత్తా చాటుకుని, మార్కెట్‌ను మరింత విస్తరిస్తాడన్న వారి ఆశలు ఫలించలేదు. ఇక తారక్, అతడి అభిమానుల ఫోకస్ ‘డ్రాగన్’ (వర్కింగ్ టైటిల్) మీదికి మళ్లనుంది. ఇది కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తున్న మూవీ కావడంతో కచ్చితంగా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందనే భరోసా ఉంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310